

విమలారామం

# అభిమానవంతులు

"పందిట్లో పెళ్ళవుతున్నాది- కను విందవుతున్నాది. నటనమే....'

బ్యాండు మేళం పాట పందిట్లో చేరిన వారికి వీనుల విందు చేస్తోంది. కూనిరాగం అలవాటున్న వాళ్ళంతా తమలో తాము పాడుకుంటున్నారు.

మిత్రుల పరిహాసాల నడుమ

నలుగుతున్న సుధాకర్ దగ్గరకి వచ్చింది రాజేశ్వరి. "ఒక్క పావుగంటయినా పెళ్ళికొడుకుని విడిచి పెట్టండయ్యా! మంగళ సూత్రం కట్టి వచ్చేస్తాడు" అని నవ్వింది.

"వెళ్ళరా పెర్రి నాయనా! వదిన గారు స్వయంగా వచ్చి పిలుస్తున్నారు...." అన్నాడు ప్రసాద రావు.

వచ్చి నువ్వు కబుర్లలో పడ్డావేమిటమ్మా! రమ్మంటున్నారు." అంటూ వచ్చింది పార్వతమ్మ.

"రా సుధా!" అని కదిలింది రాజేశ్వరి.

చటుక్కున ఆమె చెయ్యి పట్టుకున్నాడు సుధాకర్. "వదినా!"

"ఏమిటోయ్?"

"నేను చెప్పింది గుర్తుందా?"

"పెళ్ళి తంతు గురించేనా?"

---

రాజేశ్వరి సుధాకర్ దగ్గరకి వచ్చింది. ఆమె గొంతు విప్పకముందే అతను చెప్పాడు."ఆమె కేలోటూ రాకుండా అభిమానంతో చూసుకుంటాను. కాని, మనం మళ్ళీ ఈ గుమ్మం తొక్కేది లేదు. అందుకు సిద్ధమయితేనె ఈ క్షణంనుంచీ ఆమె నా భార్య అవుతుంది. నీకు చెల్లెలవుతుంది. తన కిష్టమయితే చెప్పమను వదినా! అంతే! అదే నా నిర్ణయం."

---

"....నీకిదే మా హృదయ పూర్వకమైన సానుభూతి!" అన్నాడు కృష్ణమూర్తి.

"షొండిరా!" అని ఎర్రబడిన ముఖంతో లేచాడు సుధాకర్.

"ఇప్పట్నుంచీ అతన్ని హడల కొట్టేస్తున్నారేమిటి పాపం!" అని కొంటెగా నవ్వింది రాజేశ్వరి.

"మరదిని పిల్చుకు రావటానికి

తల వూపాడతను.

రాజేశ్వరి చిన్నగా నవ్వింది. "మొత్తమంతా అరగంట. మీ అన్నయ్య, బ్రహ్మంగార్కి, ఆడ పెళ్ళివారికి చెప్పారు. సరేనా!"

సుధాకర్ నవ్వుతూ తల వూపాడు.

"ఏమిటో శుభ్రంగా ముచ్చట్లన్నీ జరిపించుకోరా నాయనా

అంటే వినడు...." పార్వతమ్మ మాటలకడ్డు వచ్చాడు ప్రసాద రావు.

"....రాత్రికి అసలు ముచ్చట్లన్నీ వద్దంటాడేమిటి లెండి!"

అతని డొక్కలో మోచేత్తో పొడిచి హెచ్చరించాడు కష్ణమూర్తి.

ముసి ముసిగా నవ్వుకుంటూ ముందడుగు వేసింది రాజేశ్వరి. ఆమె వెనక అంతా పందిట్లోకి నడిచారు.

పందిట్లో చేరిన వాళ్ళ నోళ్ళల్లో నానుతున్నాడు పెళ్ళికొడుకు.

'....అసలు కట్నమే వద్దన్నాట్ట!'

'కట్నం మాటటుంచండి. పెళ్ళి చూపులే వద్దన్నాట్ట తెలుసా!'

'చిత్రంగా ఉందే!'

'చిత్ర మేముందండి. అన్నా వదినల పెంపకం. వాళ్ళ కిష్ట మయితే తన కిష్టమన్నాడంటే.... వాళ్ళంటే ఎంత గౌరవాభిమానాలో వేరే చెప్పాలా?'

'అయితే, అమ్మాయి నింత వరకు చూడ్నే లేదంటారా?'

'చూసాడు లెండి. పదిహేను రోజుల క్రితం వాళ్ళ వాళ్ళ దగ్గరకి వెంకట్రావు గారు వెళ్ళి అడిగారట్ట. మీవాడి కిష్టమయితే మాకేంఅభ్యంతరం లేదన్నారువాళ్ళు. దాంతో....'

'....ఇంకేముంది? పిల్లాడు నచ్చిందన్నాడు. ముహూర్తం పెట్టేసారు. అందుకే అంటారు-కక్కొచ్చినా కళ్యాణమొచ్చినా ఆగదని....'

'ఇదంతా కుటుంబరావు గారి చాకచక్యం లెండి....కుటుంబ రావుగారు తెలియదూ? అదేనండీ వెంకట్రావుగారి బావమరిది. ఆయన మాంచి వ్యవహర్త లెండి. స్వయంగా పెళ్ళికొడుకుని వెంట బెట్టుకు వచ్చాట్ట. పెళ్ళి చూపు లయిన వెంటనే పెళ్ళికొడుకుతో పాటు, వాళ్ళ వాళ్ళ దగ్గరకి వెళ్ళాడు. అక్కడే అబ్బాయి అభి ప్రాయం తెలుసుకొని, ముహూర్తం పెట్టించుకొని మరీ వచ్చాడు....'

'ఓహో! అందుకనేనా వెంకట్రావుగారీ పెళ్ళంత హడా విడిగా చేస్తున్నారు!'

'హడావిడికేముందండి? పెళ్ళి వారొచ్చి రెండు గంటలు కాలేదు. మరో గంటలో పెళ్ళితంతు ముగిసి పోతుంది. అవునండీ! సింపుల్‌గా పెళ్ళికానివ్వమన్నాట్ట పెళ్ళికొడుకు. ఇలా ఫోంచేసి, అలా బండెక్కే-స్తారు! ఇక ఖర్చేది? ఇలాంటి పెళ్ళికొడుకులుంటే వెంకట్రావు గారనేమిటి? ఏ తండ్రయినా

క్షణాల మీద పెళ్ళి చేయగలడు!'

'చిత్రంగా ఉందే?'

'చిత్ర మేముందండీ? పెళ్ళి కొడుకు బుద్ధిమంతుడు. రోజుల్ని బట్టి పోవాలన్నాడు. కట్నాలక్క ర్లేదన్నాడు. ఆ పైన అనవసరమైన ఖర్చులూ వద్దన్నాడు!....'

హఠాత్తుగా పందిట్లో కలకలం బయలుదేరింది. ఏమిటంటే ఏమిటని ఒకర్ని ఇంకొకరు అడుగుతున్నారే కాని, ఒకరికీ అసలు సంగతేమిటో అంతు పట్టలేదు.

రాజేశ్వరి అయోమయంగా చూస్తూ నిలబడింది. ఆమెకి కాళ్ళాడటం లేదు. విన్నది నిజమో కాదో తెల్సుకోవటానికి అటు లోపలికీ వెళ్ళలేక పోతోంది, ఆ సంగతి మరిది చెవిని వెయ్యటానికిఖ కదలీ రాలేక పోతోంది!

"అలా దిక్కులు చూస్తూ నిల బడతావేమిటే! పెళ్ళి కనుక్కో!" పార్వతమ్మ తోసినంత పని చేసింది.

"ఏమిటే పార్వతీ హడావిడి?" అంటూ వచ్చాడు రాఘవరావు.

"ఇంకా ఏమిటని అడుగుతు న్నారా? అయ్యో రాత....పెళ్ళి కూతుర్ని మార్చేసారండీ!" అంది పార్వతమ్మ రుసరుస లాడుతూ.

రాఘవరావు తెల్లబోయాడు. పెళ్ళి కూతుర్ని మార్చటం ఏమిటే?"

"మీకంత సులభంగా అర్థమైతే ఇకనేం! మన సుధగాడికి ఆవేళ పెళ్ళి చూపుల్లో చూపించింది ఓ అమ్మాయిని..ఇప్పుడు పెళ్ళిపీటల మీదకి పంపబోయేది మరో అమ్మా యిని. అర్థమయిందా?"

రాఘవరావుకి నోట మాట రాలేదు. పెళ్ళి మంటపం వైపు దృష్టి సారించాడు. సుధాకర్ ప్రక్కకి వంగి తన స్నేహితులతో నవ్వుతూ కబుర్లు చెప్తున్నాడు! అవతల వైపున్న కుర్చీల మీద రాఘవరావు దృష్టి పడింది. పిల్ల వాడి నెత్తుకొని ఎవరితోనో కులా సాగా మాట్లాడుతున్నాడు శ్రీనివాస్.

పరుగు పరుగున వెళ్ళి అతన్ని తీసుకొని వచ్చాడు రాఘవరావు. సంగతి చెప్పమన్నట్టు భార్యవైపు చూసాడు.

"అసలు పెళ్ళికి రాకముందు పెళ్ళి కూతుర్ని నువ్వు చూసా వట్రా? పోనీ, రాజీ!....నువ్వు చూసావటే?" అని అడిగింది పార్వతమ్మ.

రాజేశ్వరి మాట్లాడ లేదు. శ్రీనివాస్ కంగారుగా నవ్వాడు. "మేం చూడా లేమిటక్కయ్యా! అసలు వాడు చూసాడు. చాలదా?"

"అదిగో, అదే ఇంత ముప్పు

తెచ్చింది. వాడెవర్ని చూసి ఎవ రనుకున్నాడో! ఇలాంటివి వెనకా ముందూ చక్కబెట్టుకోటానికే పెద్ద వాళ్ళు ప్రక్కనుండాల్సింది."

"ఇప్పుడే మయింది?"

"పెళ్ళికూతుర్ని మార్చే సారు."

శ్రీనివాస్ నిర్విణ్ణపోయాడు. అంతలోనే నవ్వి, "నువ్వు ముందు చూడలేదు కదా- మార్చా రని ఎలా చెప్పగలవ్?" అన్నాడు.

"ఏమేవ్ రాజీ! మీ ఆయనకి చెప్పు- ఇందాక లోపలికి వెళ్ళి నప్పుడు మన మిద్దరి పెళ్ళికూతు ళ్ళని చూసామా-లేదా?"

"ఇద్దరేమిటి?" అన్నాడతను అయోమయంగా.

"అక్కతోపాటు చెల్లెల్నితోడు పెళ్ళికూతుర్ని చేశార్టండీ?" అంది రాజేశ్వరి.

"ఓస్, అదా!"

"నవ్వటం కాదు. అందులో అసలు పెళ్ళికూతు రెవరు? తోడు పెళ్ళి కూతు రెవరు? ఇద్దర్నీ ఒక్కలా ముస్తాబు చేసారు. అప్పుడే అనుకున్నాను.... ఇందులో ఏదో మోసం ఉందని." అంది పార్వతమ్మ.

రాజేశ్వరి ఏదో అనబోయి ఆగి పోయింది.

"పచ్చగా, పొడుగ్గా ఉన్న అమ్మాయి అక్కనీ,నల్లగా పొట్టిగా ఉన్న పిల్ల చెల్లెలనీ అనుకున్నామా లేదా!" అని మళ్ళీ రెట్టించింది పార్వతమ్మ.

రాజేశ్వరి తలవూపింది.

"మన వూహ తారుమార యింది. తెల్లపిల్ల చెల్లెలట. నల్ల పిల్ల అక్కట! కావాలంటే అడిగి తెల్సుకోండి."

"ఒకవేళ సుధా ఆ అమ్మాయినే చేసుకుంటానని చెప్పాడేమో!" అన్నాడు రాఘవరావు.

"బావుంది మీ వరస. ఆ పిల్లని చూసాక...."

ఆమె మాటలు వినిపించుకో కుండా రాఘవరావు పెళ్ళిమంటపం వైపు కదిలాడు.

"ఆగండన్నయ్యా!" అంది రాజేశ్వరి.

ముగ్గురూ ఆమె వైపు ఆత్రు తగా చూసారు.

"మన ప్రమేయం లేకుండా సుధా పెళ్ళి చూడ్డం, తన నిర్ణయం మనకీ వాళ్ళకీ చెప్పటం అంతా ఇలా క్షణాల మీద జరిగి పోయింది. ఎక్కడ ఎలా పొరపాటు జరి గిందో మనకి తెలియదు. తొందర పడి మన మేదయినా అంటే వాళ్ళ మాటెలా ఉన్నా సుధా బాధ పడ

తాడు. ముందు పెళ్ళి కూతుర్ని పీటలమీదకి తీసుకురానివ్వండి. అప్పుడు...."

రాజేశ్వరిమాటలు పూర్తి కాకుండానే పెళ్ళికూతురు మంటపంలోకి రావటం జరిగింది.

"పిల్ల నలుపంటావేమిటే - చక్కగా ఉంటేను! తెల్లని తెలుపు కాదేమోకాని- ముఖమెంత కళగా ఉందో చూడు!" అన్నాడు రాఘవరావు నెమ్మదిగా.

"ఊ! మీరూరుకోండి. మీకేం తెలియదు....ఆ రెండో పిల్లని చూస్తే అప్పుడు తెలుస్తుంది, తెలుపుకీ- నలుపుకీ తేడా!" అని కసురుకుంది పార్వతమ్మ.

సుధాకర్‌ని విడిచి స్నేహితులు ప్రక్కకి వెళ్ళారు. అందరి దృష్టి అతని మీదే ఉంది. ప్రక్కన పెళ్ళి కూతురు కూర్చున్నా, అతను తల త్రిప్పిచూడలేదు. సిగ్గువల్ల కాబోలు, అతని చెంపలు ఎరుపెక్కాయి.

రాజేశ్వరి గబ గబా అతని ప్రక్కకి వెళ్ళి, భుజం మీద చేయి వేసి "అమ్మాయిని చూడు సుధా!" అంది ఉద్వేగాన్ని అణచుకుంటూ.

"ఇప్పుడూ చూడాలా?" అన్నాడతను సిగ్గుగా.

"మరో సారి చూడు." అందామె గంభీరంగా.

సుధాకర్ తలత్రిప్పి చూసి గతుక్కుమన్నాడు. అతని ముఖంలో రంగులు మారాయి. వదినగారి వైపు అయోమయంగా చూసాడు.

"నువ్వొప్పుకుంది ఈ పిల్ల కాదన్నమాట!" అందామె నెమ్మదిగా.

అతని పెదవులు వణికాయి, తల అడ్డంగా త్రిప్పాడు.

పార్వతమ్మ వచ్చి రాజేశ్వరి భుజం తట్టింది. "నా అనుమానం నిజమేనా?"

రాజేశ్వరి మౌనం జవాబు చెప్పింది.

"మోసం! మోసం!...." అని గట్టిగా అరిచింది పార్వతమ్మ.

అంతా గుమిగూడారు. ఐదు నిమిషాలదాకా ఒకరి మాట ఇంకొకరికి వినిపించనంత గందరగోళం అయిపోయింది.

"ఆగండి. ఏమయిందసలు?" అంటూ వచ్చాడు కుటుంబరావు.

"మీరెవరు? ఓహో! పెళ్ళి కూతురు మేనమామగారా?" అందే పార్వతమ్మ వ్యంగ్యంగా.

"అవునండి." అని చిరునవ్వు నవ్వాడతను.

"ముందు వెంకట్రావుగారిని ఇలా రమ్మనండి."

"ఇక్కడే ఉన్నానమ్మా!" అంటూ వచ్చాడతను.

భార్యనాగమని సంజ్ఞచేసి, "చూడండి వెంకట్రావుగారు! పెళ్ళి చూపుల నాడు మావాడికి చూపించింది ఈ అమ్మాయి కాదట. పెళ్ళికూతురు మారిపోయిందని రూఢయిపోయింది. దానికి మీరేమంటారు?" అన్నాడు రాఘవరావు.

వెంకట్రావు కంగారుగా కుటుంబరావు వైపు చూసాడు.

కుటుంబరావు నవ్వు తెచ్చిపెట్టుకున్నాడు. "అబ్బెబ్బే! అలాంటిదేం లేదండీ! ఇద్దర్నీ చూసాడు. ఈ పిల్లని చేసుకోటానికే మీ అబ్బాయి ఇష్టపడ్డాడు. మీరిప్పుడిలా అంటే ఎలాగ....?"

సుధాకర్ ముఖం జేవురించింది. విసురుగా పైకి లేచాడు. వెనక్కి తిరిగే లోగా ఎవరో చెయ్యి పట్టుకున్నారు. చటుక్కున అటు తిరిగాడు. పెళ్ళి కూతురు! ఆమె కళ్ళల్లో నీళ్ళు. ప్రార్థన!

నొసలు చిట్లించి, "ఏమిటీ?" అన్నాడు గట్టిగా.

చేతిలోని కాగితం మడత అందించింది పెళ్ళి కూతురు.

"ఏమిటిది?" తల తిప్పుకోబోయాడతను.

ఆమె కన్నీటితో రాజేశ్వరి నర్థించింది.

"పోనీ, చూడు సుధా!"

ఆమె చేతిలోని కాగితం మడత విసురుగా లాక్కున్నాడు సుధాకర్.

"శ్రీ సుధాకర్!

క్షమించండి. మేము మిమ్మల్ని మోసం చేశాం. ఇందులో మా నాన్నగారికీ, అమ్మకీ, మావయ్యకీ, నాకూ- అందరికీ భాగముంది. కారణం....ఎలాగైనా నా పెళ్ళి కావాలని.

ఇంత కాలంగా నాకు పెళ్ళి ఎందుకు కాలేదో నాకు తెలియలేదు. అందరూ అనేదేమిటంటే, నేను నల్లపిల్లనని. లోకంలోని నల్లని వాళ్ళకి పెళ్ళిళ్ళు కావటం లేదా- అంటే అవుతున్నాయి. కాని, చెల్లెలు ప్రక్కనుండటం అక్క అదృష్టానికి అడ్డువస్తోందని అంతా అంటున్నారు. అందులో నాకేదీ నిజం కనిపించక పోయినా....నా కోసం వచ్చిన వాళ్ళు చెల్లెల్నయితే చేసుకోటానికి తమ అభ్యంతరం లేదనటం విన్నాను!

ఇలా పుట్టాలనుకొని నేనిలా పుట్టలేదు. నాకిలా అవుతుందనుకొని చెల్లాయి పుట్టలేదు. అయినా, దానివల్ల నా పెళ్ళి కావటంలేదు, నావల్ల దాని పెళ్ళి కావటం లేదు!

ఇన్నాళ్ళ అనుభవంతో నా జీవితం ఇక ఎలా ఉండాలో నేనే నిర్ణయించుకున్నాను. ఉద్యోగంలో చేరాను. నా పెళ్ళి గురించి ఆలోచించటం ఎప్పుడో మానేశాను. నాకు పెళ్ళి చేసుకోవాలన్న కోరిక కూడా ఇప్పుడు పోయింది!

అక్కకి చెయ్యందే చెల్లెలికెలాగ అంటుంది మా అమ్మ! ఇలా నా గురించి చెల్లెలి పెళ్ళి ఆగిపోవటం అన్యాయం. అందుకనే, నాకిప్పుడు చేసుకోవాలని లేదని.... చెల్లెలి పెళ్ళి జరిపించండని చెప్పాను.

మీరు పెళ్ళి చూపులు కూడా అక్కర్లేదన్నారని విన్నాక మా వాళ్ళకు క్రొత్త ఆశలు కలిగాయి. ఒక్క సారి వచ్చి చూడమని మా మామయ్య స్వయంగా వచ్చి మిమ్మల్ని తీసుకువచ్చాడు.

ఒకే రకం చీరలు తెచ్చారు నాన్నగారు. పెళ్ళి చూపుల నాడు ఇద్దర్నీ ఒక్కలా డ్రస్ చేసుకోమన్నారు. అందరితోపాటు మా యిద్దర్నీ కూర్చో బెట్టారు. ఇద్దరం కాఫీ టిఫిన్లందించాము. నిజంగా అదంతా చెల్లెలి పెళ్ళి చూపులకనే నేననుకున్నాను.

శుభలేఖ చూసేవరకూ, మా మామయ్య కావాలనే మీతో, మీ వాళ్ళతో అబద్ధం చెప్పాడని నాకు తెలియదు. మీ దృష్టిలో 'విజయ' అంటే చెల్లెలు. కాని, 'విజయ'ను నేను!

జరిగిన మోసం నాకు తెల్సి వచ్చింది. ఇద్దర్నీ ఒకే రకం బట్టలు కట్టుకోమనటం, ఇద్దర్నీ మీముందు కూర్చోమనటం, మీ పెద్ద వాళ్ళు రాకుండానే మిమ్మల్ని వెంట బెట్టుకు రావటం, మీ వెంట వచ్చి ఒప్పించి ముహూర్తం పెట్టించటం.... ఇవన్నీ మామయ్య ప్లానులో భాగాలు.

మీరెంతో మంచివారు. అందుకనే కట్నం అసలక్కర్లేదన్నారు. అనుకోకుండా చెల్లెలికింత అదృష్టం కలిసొచ్చినందుకు నేను పొంగిపోయాను.

కాని, మీ మంచితనాన్ని దుర్వినియోగం చేయటానికి పూనుకున్నారు మావాళ్ళు. 'మోసం చేసి మా జీవితాలు కలపాలనుకోవటం సాధ్యంకాదు. మనుషులు బొమ్మలు కాద'ని ఎంతో చెప్పాను.

'ఎన్ని అబద్ధాలాడయినా ఒక పెళ్ళి చేయాలన్నారు. పెళ్ళి పీటల మీద నిన్ను కూర్చోబెట్టి....నిన్ను చూసే ఆ వేళ పెళ్ళికొడుకు ఒప్పుకున్నాడని చెప్తాం....కాదంటే బలవంతం చేస్తాం....' అని

చెప్పాడు మామయ్య.

ఆ స్థితిలో అంతా అప్రతిష్ట పాలవుతామని.... అటువంటి అసహ్యకరమైన పరిస్థితి నుంచి అందర్నీ తప్పించాలని వెంటనే నా ఫోటో ఒకటి జతపరచి అసలు 'విజయ'ను నేనేనని మీ ఎడ్రసుకి ఉత్తరం వ్రాసాను.

కాని, నా ఉత్తరం పోస్టులో మిస్సయిందో, మరే కారణం చేతనో మీ నుంచి ఎటువంటి జాబూ రాలేదు. పైగా అనుకున్న రోజుకి వస్తున్నామంటూ మీ అన్నయ్యగారు వ్రాసిన ఉత్తరం అందింది.

ఒకవేళ మీరు నా ఉత్తరం అందుకొని, నా మీద దయతో మనస్సు మార్చుకున్నారేమోనని భ్రమపడ్డాను. నా స్వార్థ బుద్ధే నన్నలా అనుకునేలా చేసింది.

అయినా, ఒకవేళ నా ఉత్తరం మీ కంది వుండకపోతే - మీ మనసులోని 'విజయ'నే పెళ్ళాడ్డానికి మీరు వస్తే.... పెళ్ళి పందిటిలో ఎలాగా నిజం బయటపడి పోతుంది. అప్పుడు జరిగింది యథాతథంగా చెప్పాలంటే నా గొంతు పెగలక పోవచ్చు. అందుకనే, నేనీ ఉత్తరం ముందే వ్రాసి పెట్టుకుంటున్నాను. పెళ్ళిపీటల మీదకి నేనిది తీసుకొని మరీ వస్తాను.

తప్పకుండా దీని అవసరం ఉంటుందని నాకు మాత్రం జీవితానుభవం చెపుతోంది. ఆ అవసరం రాకపోతే.... నా జీవితంలో అది అద్భుతమే అయి ఉండాలి!

మావాళ్ళు మిమ్మల్నిలా మోసం చేయటం క్షమించరాని నేరం! కొద్దో గొప్పో తెలిసికూడా పెళ్ళి పందిటిలోకి నడిచి రావటం మహాపరాధం. నేను, మీకు ముందే ఉత్తరము వ్రాసినా....మీకది అందినట్లు రూఢిగా తెలియనప్పుడు నా తప్పు తప్పే అవుతుంది.

కాని, మా తప్పులవల్ల నా చెల్లెలి జీవితంలోకి నడిచి వద్దామనుకున్న ఒక మంచి మనిషిని-ఉన్నత వ్యక్తిని పోగొట్టుకోవటం ఎంతో దౌర్భాగ్యమవుతుంది.

జరిగిన దానికి మమ్మల్నందర్నీ క్షమించండి. అందరి తరఫునా మనస్ఫూర్తిగా మన్నించ వేడుతున్నాను. నా చెల్లెలు ఏ పాపమూ ఎరుగదు. దయతో ఆమెను మీ భార్యగా స్వీకరించండి!

ఇదే నా ప్రార్థన. నా జీవితంలో ఇంతకంటే ఎవర్నీ, ఏదీ, ఎప్పుడూ కోరను.

—విజయ"

సుధాకర్ విజయవైపు చూశాడు.

కన్నీటి ధారలతో బుగ్గలు తడిసి వున్నాయి, పెదవులు వణుకు తున్నాయి, ప్రాణా లుగ్గపట్టుకొని కళ్ళప్పగించి చూస్తోందామె!

ఒక్కసారి చుట్టూ కలయ జూసాడు సుధాకర్. అందరి దృష్టీ అతని మీదే వుంది. ఆ కాగితం వదినగారి కిచ్చి, గబగబా వెళ్ళి ఓ కుర్చీలో కూలబడి కళ్ళు మూసు కున్నాడు సుధాకర్.

చీమ చిటుక్కుమన్నా వినప డేంత నిశ్శబ్దంగా ఉంది పెళ్ళి పందిరి.

గబగబా ఆ వుత్తరం చదివి శ్రీనివాస్ కందించింది రాజేశ్వరి.

"మీ అమ్మాయి వ్రాసింది.... మీరూ చదవండి!" అని వెంక ట్రావు మీదకా కాగితం కోపంగా విసిరేసాడు శ్రీనివాస్.

పందిట్లో గుసగుసలు మొద లయ్యాయి.

తమ్ముడి దగ్గరకి వెళ్ళాడు శ్రీనివాస్. అతని చేతిమీద తన చేయి వేశాడు. సుధాకర్ తల ఎత్తి చూసాడు. అతని కళ్ళు ఎర్రబడి వున్నాయి, కణతల దగ్గర నరాలు వుబ్బాంగాయి.

శ్రీనివాస్ కెంతో బాధ కలి గింది. "ఛ! మంచి వాళ్ళకివి రోజులు కావురా!"

రాజేశ్వరి దగ్గరగా వచ్చింది. కాని, ఆమె కేం చెప్పటానికీ నోరు రాలేదు.

వెంకట్రావు నుంచి కుటుంబ రావా ఉత్తరం అందుకున్నాడు. అతన్నుంచి రా ఘ వ రా వు.... క్రమంగా చేతులు మారి.... అంద రికీ అసలు సంగతి అర్థమై పోతోంది.

కు టుం బ రావేదో చెప్ప బోయాడు. "నీ సలహాలిక చాల్లే. ఇప్పటి కింతయింది." అని అతని చేతులు త్రోసేసి శ్రీనివాస్ దగ్గరకి వచ్చాడు వెంకట్రావు. "ఇవి చేతులు కావు.... కాళ్ళనుకోండి బాబూ! మేం చేసింది ముమ్మాటికీ తప్పు. మా విజయ సమయానికి మా కళ్ళు తెరిపించింది."

"లేదు. సమయం మించి పోయింది. ఆ అమ్మాయి ముందే చెబితే వినలేదు మీరు. మంచికి పోయిన మా తమ్ముడ్ని దారు ణంగా మోసం చేసారు. మీ చేజే తులా మీరే, మీ పిల్లల జీవితాలు పాడుచేసారు.ఇంత జరిగాక మీతో సంబంధం కలుపుకోవటం మాకు పరువు తక్కువ!" అన్నాడు శ్రీని వాస్ ఉద్రేకంగా.

వెంకట్రావుకి కళ్ళ నీళ్ళు తిరి గాయి. "మమ్మల్ని క్షమించండి

బాబూ! బుద్ధి గడ్డితిని ఈ పని చేసాము....''

''ఇంకా కూర్చున్నారేమిరా! లేవండి పోదాం!'' అప్పుడే విజయ ఉత్తరం చదివి వచ్చిన పార్వతమ్మ కేకలు వేసింది.

''మా తప్పులకి పిల్ల బలయి పోకూడదు బాబూ!''అంటూ వెంకట్రావు మళ్ళీ శ్రీనివాస్ చేతులు పట్టుకున్నాడు.

అతని చేతులు త్రోసేసి చివాలున లేచాడు శ్రీనివాస్. ''నడు సుధా! మన కిక్కడ ఉండాల్సిన పని లేదు!''

ఇంతలో వెంకట్రావు భార్య పద్మావతి, రెండో కూతురు గిరిజను రెక్క పట్టుకు లాక్కు వచ్చింది. ''అక్కయ్య గారిని క్షమించమని అడగవే!'' అని రాజేశ్వరి కాళ్ళ దగ్గర కూలేసింది.

రాజేశ్వరి కంగారుగా వెనకడుగు వేసింది ''ఛ! ఇదేమిటండీ?''

''తాము చేసిన తప్పులకి పిల్లల చేత క్షమాపణ చేయిస్తున్నారే!'' అంది పార్వతమ్మ వెటకారంగా.

''లేమ్మా, లే!'' అంది రాజేశ్వరి గిరిజ ఒంటిమీద చేయివేస్తూ.

చటుక్కున రాజేశ్వరి చేతులు పట్టుకుంది పద్మావతి. ''మాకు జరగవల్సిన పరాభవం జరగనే జరిగిందమ్మా! ఇంత మందిలో అపరాధులుగా నిలబడ్డాము. ఇదే మరొకరయితే ఇంకో క్షణంకూడా ఇక్కడ నిలబడుండే వాళ్ళుకాదు.. మీరు మంచి వాళ్ళు, మా ప్రార్థన మన్నించండి. దీని జీవితం నిలబెట్టండమ్మా! ....''

భర్త వైపు - మరది వైపు అయోమయంగా చూపింది రాజేశ్వరి.

సుధాకర్ కళ్ళు వదినగారి కళ్ళతో కలిశాయి. ఆమె కళ్ళతో ఏ సందేశమిచ్చిందో ....అతనర్థవంతంగా తల పంకించాడు. శ్రీనివాస్ తమ్ముడివైపు ప్రశ్నార్థకంగా చూసాడు.

''ఒక్కసారిటురా అన్నయ్యా!'' అన్నాడు సుధాకర్.

దూరంగా వెళ్ళి అన్నదమ్ములిద్దరూ ఏం మాట్లాడుకున్నారో ఎవ్వరికీ అర్థం కాలేదు.

పది నిమిషాలు గడిచినా వాళ్ళు వెనక్కి రాకపోయేసరికి, ఇక ఉండబట్టలేక పార్వతమ్మ వాళ్ళ దగ్గరకి వెళ్ళింది. ''ఏంరా శీనూ! ఏమిటాలస్యం?....ఇక్కడ మనమింక వుండటం అనవసరం. ఏ హోటల్లోనో భోంచేసి బండెక్కేద్దాం.''

కొన్ని క్షణాలు మాట్లాడలేదు శ్రీనివాస్. ''మంచికి పోతే గౌర

వము దెబ్బతినేలా వుంది. గౌరవం చూసుకుంటే మన మూలంగా ఆడపిల్ల పెళ్ళి చెడిపోయిందన్న చెడ్డపేరు''

''దానికేమన్నా మనం బాధ్యులమా?''

''మనం బాధ్యులం కాదని వెళ్ళిపోతామంటే, ఇక్కడ అడిగే వాళ్ళెవ్వరూ లేరక్కయ్యా! కాని, అటు మన గౌరవం - ఇటు మంచితనం రెండూ దక్కించుకొనే మార్గం చెపుతున్నాడు సుధా.''

''ఏమిటీ?''అంది పార్వతమ్మ వెలవెలబోతూ.

''చెప్తా పద.''

అన్నదమ్ము లిద్దరూ పెళ్ళి పందిట్లోకి నడిచారు.

''విజయ నిలా పిల్చుకురా రాజీ!'' అన్నాడు శ్రీనివాస్.

పెళ్ళి పీటలవద్ద అప్పుడు లేచి నిలబడిన విజయ.... ఇప్పటిదాకా అలాగే ప్రతిమలా వుండిపోయింది.

రాజేశ్వరి చేతి స్పర్శకి ఉలిక్కిపడి స్పృహలోకివచ్చింది.

''రమ్మంటున్నారమ్మా!''

విజయ పెదవులు కదిలాయి కాని, శబ్దం బయటకు రాలేదు.

''రా!'' అని ఆమె చేయి పట్టుకొని తీసుకు వచ్చింది రాజేశ్వరి.

అంతమంది గుమిగూడి వున్నప్పటికీ పెళ్ళిపందిరి నిశ్శబ్దంగా వుంది. ముందేం జరగనుందా అన్న ఉత్కంఠతో అంతా ఊపిరి బిగపట్టారు!

''చూడమ్మా విజయా!'' అన్నాడు శ్రీనివాస్.

ఆమె తలయెత్తి ఓసారి చూసింది.

''మా తమ్ముడో నిర్ణయానికి వచ్చాడు! నాకూ అదే సబబని తోచింది!'' అని ఆగాడు.

ఎవ్వరికీ కనురెప్పలు కూడా కదలటం లేదు. రెప్పలార్పకుండా చూసింది విజయ.

''నీ నిజాయితీ మా వాడి మనస్సు నాకట్టుకుందమ్మా! వాడు నిన్నే పెళ్ళాడాలనుకుంటున్నాడు''

ఆ మాట విన్న వెంటనే మన స్ఫూర్తిగా సంతోషపడిన రాజేశ్వరి ముఖంలో, సంతృప్తి వెన్నెల వెలుగు చిందించింది!

ఒక్కసారిగా పందిట్లో కలకలం బయలుదేరింది. విజయ మనసులో కలవరం బయలుదేరింది.... విన్నది నిజమా కాదా అన్నట్టు!

''ఎంత మంచి మాట శలవిచ్చారు బాబూ!'' అంటూ పొంగిపోతూ, వెంకట్రావు దగ్గరగా వచ్చాడు.

అతని చేతులుతో సేస్తూ, "నేను మాట్లాడుతున్నది మీతో కాదు.... విజయతో!" అన్నాడు శ్రీనివాస్ కఠినంగా.

వెంకట్రావే కాదు.... విజయ కూడా నిర్ఘాంతపోయింది. పందిట్లో మళ్ళీ కలకలం తగ్గి ఉత్కంఠ పెరిగింది!

"ఏమిట్రా యిది! వాడికి మతి లేకపోతే నీకూ లేదా? వాళ్ళింత చేస్తే ఇంకా మీరు పెళ్ళి, పెళ్ళి అంటున్నారేమిటి?" అంది పార్వతమ్మ కోపంగా.

"నువ్వొక్క క్షణం ఆలోచిస్తే నీకే అర్థమవుతుందక్కయ్యా!" అన్నాడు శ్రీనివాస్ నిదానంగా.

"ఏమిట్రా ఇంకా ఆలోచించేది? వీళ్ళతో సంబంధం కలుపుకుంటే మనకింక గౌరవం ఉంటుందా?"

"చూడక్కా! మనిషికి గౌరవం ఎంత ముఖ్యమో- ఓ మంచి పని చేయటం కూడా అంతే ముఖ్యం! అదే తమ్ముడు చేస్తానంటున్నది"

"మనం మంచి పని చేయొచ్చు. దానికూడా వాళ్ళకి అర్హత ఉండాలి"

"ఎవరికున్నా లేకపోయినా, విజయకా అర్హత ఉంది. వాళ్ళ వాళ్ళకి అవమానం జరుగుతుందనయినా సంకోచించకుండా, బహిరంగంగా నిజం బయటపెట్టింది. ఆ అమ్మాయి నిజాయితీని మనం గౌరవించాలి"

పార్వతమ్మ తెల్లబోయింది. "ఇంత జరిగినా కూడానా?"

"ఇప్పుడు తమ్ముడు కోరుకునేది వాళ్ళని అగౌరవపరచటం కాదక్కయ్యా! విజయని గౌరవించటం.... అంటే మంచిని గౌరవించటం!"

భర్త వైపు ప్రేమాభిమానాలు నిండిన కళ్ళతో చూస్తోంది రాజేశ్వరి.

అంతలో ఆమె చెయ్యి పట్టుకొని నెమ్మదిగా ఏదో చెప్పింది విజయ.

"ఏమిటి రాజీ?" అని అడిగాడు శ్రీనివాస్.

"వాళ్ళ చెల్లెల్ని పెళ్ళాడితే చాలు- తనకు సంతోషమంటోంది" అంది రాజేశ్వరి.

శ్రీనివాస్ మరో అడుగు దగ్గరగా వచ్చాడు. "చూడమ్మా విజయా! ఈ పందిట్లో యింత సేపింకా మేం నిలబడ్డామంటే కారణం నువ్వే! మా తమ్ముడు పెళ్ళాడితే నిన్నే- మీ చెల్లెల్ని కాదు.... చెప్పు నీ కిష్టమవునా కాదా?"

ఆనందోద్వేగంతో విజయకి

నోట మాట రాలేదు.

పరమానందపడిపోతూ కూతురి దగ్గరకి దూసుకువచ్చింది పద్మావతి. "ఇష్టమేనని త్వరగా చెప్పవే!" అంది.

"మేం జరిపించాలన్నది కూడా ఇదే పెళ్ళి కదండీ!" అని పెద్దగా నవ్వుతూ దగ్గరగావచ్చాడు కుటుంబ రావు.

శ్రీనివాస్ ముఖంజేవురించింది. "ఇందాక మీరుజరిపించాలనుకున్న పెళ్ళి, మేమిప్పుడు జరిపించాలను కుంటున్న పెళ్ళి- ఒక్కటికాదు. మర్యాదగా దూరంగా ఉండండి. మా మాటల మధ్యకి రాకండి!"

కుటుంబరావు ముఖం నల్లబడి పోయింది.

అతని గొంతులో పొంగిన ఆవేశానికి అంతా ఆశ్చర్య పోయారు. కోపాన్నణచుకోటానికి ఓ నిమిషం ఆగాడు శ్రీనివాస్. "చూడమ్మా విజయా! మనిషికి పైపై మెరుగులకన్నా మంచి మనసు ముఖ్యం. అది నీలో ఉంది. అదే మా తమ్ముడికి నచ్చింది.... మాకూ నచ్చింది. అందుకనే వాడు నిన్ను పెళ్ళాడా లనుకుంటు న్నాడు"

విజయ ఆనందాశ్చర్యాలతో అన్నదమ్ములిద్దర్నీ మార్చి మార్చి చూసింది.మనస్సులో పొంగుతున్న ఉద్వేగం ఆమె పెదవుల్ని వణికిం చింది.

అంతవరకు చిత్రం చూస్తూ నిలబడిన పురోహితుడు దగ్గరకి వచ్చాడు. "బాబుగారూ! శుభలేఖ ప్రకారం కూడా వధూవరులు వీళ్ళే కదా! మరి ముహూర్తం వేళ దగ్గ రవుతోంది.... వధూవరులిద్దరూ పీటల మీదకి వస్తే...."

"చాలు! ఇప్పటిదాకా మీరు చదివిన మంత్రాలు, జరిగిన తంతులు చాలు. మాక్కావల్సింది అబద్ధపు మర్యాదలు, అర్థంలేని సాంప్రదా యాలూ కాదు. మంచికోసం మను షులు నిలబడాలి, మర్యాదలు నిల బెట్టుకోవాలి. మీ దక్షిణ తాంబూ లాలు తీసుకొని మీరిక వెళ్ళొచ్చు"

పురోహితుడి కింక గొంతు పెగలలేదు.

సుధాకర్ వైపుచూసింది విజయ. అతని ముఖంలోని వెలుగు ఆమె మనస్సుని పులకింపజేసింది.

రాజేశ్వరివైపు తిరిగి, "ఇది నా అదృష్టంగా భావిస్తాను" అంది నెమ్మదిగా.

"ఏమిటమ్మా! కొంచెం గట్టిగా చెప్పు. ఇది నీకూ,మాకూ సంబం ధించిన విషయం. నువ్వేదీ సందే హించకు. నీకు మనఃపూర్వకంగా

యిష్టమయితేనే...." అన్నాడు శ్రీనివాస్.

విజయ కళ్ళు ఆనందభాష్పాలను పూరించుకున్నాయి.

ఆమె పెదవివెంట మాట వచ్చే లోపల, "అయితే ఒక షరతు!" అన్నాడు సుధాకర్.

అందరి దృష్టి అతని వైపు తిరిగింది.

"ఈ క్షణం నుంచీ మనకు ఈ ఇంటితో సంబంధం ఉండదు"

ఒక్కసారిగా పందిట్లో కలకలం బయలుదేరింది.

'అన్యాయం' అన్నారెవరో.

'అవునవును. ఎంతయినా పుట్టిల్లు!' అని మరొకరు, తలొకరకంగా


# శ్రీ బాలాజీ వైద్యశాల

**సెక్స్ స్పెషలిస్టు డా॥ పి. కుమారస్వామి దేవర**

**మార్వాడి గుడివద్ద, ఫోన్: 551, తెనాలి (ఎ.పి.)**

**బ్రాంచి: 9-డి, శివాజీ స్ట్రీట్, మద్రాస్-17.**

**దీర్ఘవ్యాధులకు వుత్తమ సిద్ధ వైద్యము**



హస్తప్రయోగంవల్ల, అతిసంభోగమువలన అంగము చిన్నదై అకస్మాత్తుగా అంగముకృశించుట శుక్ల నష్టము, నపుంసకత్వము, (ఒక డోస్‌తో ఎన్నడూ, కనివిని ఎరుగనంత వీర్యస్తంభన కలిగి హాయి నిచ్చును. అసంతృప్తి చెందు స్త్రీ, పురుషులువాడతగినది వస్తువులు). హెర్నియా (గిలక) కుష్టు, బొల్లి, చర్మవ్యాధులకు పోస్టుద్వారా వైద్యం చేయబడును. వరిబీజము(బుడ్డ) మూత్రవ్యాధులు అపరేషన్ లేకుండా నయంచేయబడును. స్వయంగా రండి.

క్షయ, ఉబ్బసవ్యాధులకు వుచిత వైద్యం - రండి.

బ్రాంచీలు :- తిరుపతి, నెల్లూరు, గుంటూర్లలో త్వరలో తెరవబడును.

అనుకుంటున్న వాళ్ళ మాటలతో అక్కడ గందరగోళం అయింది.

"వీల్లేదు. మేమీ పెళ్ళికొప్పుకోము" అన్నాడు కుటుంబరావు.

"మీ రొప్పుకోకపోతే మునిగిపోయిందేం లేదు సార్!....ఒప్పుకోవల్సింది అమ్మాయి" అన్నాడు ప్రసాదరావు, సుధాకర్ భుజంమీద మెచ్చుకోలుగా తట్టుతూ.

"ఏమిటి బావా? వాళ్ళేం చెపితే అదేనా రైటు?" అని వెంకట్రావు భుజంమీద ఉక్రోషంతో కొట్టి మాట్లాడాడు కుటుంబరావు.

"బాబూ! అంత మాటనకండి" అన్నాడు వెంకట్రావు, శ్రీనివాస్ చేతులు పట్టుకుంటూ.

"మీ బావగారేదో చెపుతున్నారు. వారితో మాట్లాడండి" అన్నాడతను వెంకట్రావు చేతులు తోసేస్తూ.

రాజేశ్వరి, సుధాకర్ దగ్గరకి వచ్చింది. ఆమె గొంతు విప్పక ముందే అతను చెప్పాడు. "ఆమె కేలోటూ రాకుండా అభిమానంతో చూసుకుంటాను. కాని మనం మళ్ళీ ఈ గుమ్మం తొక్కేది లేదు. అందుకు సిద్ధమయితేనే ఈ క్షణం నుంచీ ఆమె నా భార్య అవుతుంది. అదే నా నిర్ణయం"

"సుధా...." రాజేశ్వరి ఏవో చెప్పబోయింది.

"విజయ మంచితనాన్ని గుర్తించమన్నావు. అదెంత ముఖ్యమో- మన ఆత్మాభిమానాన్ని కాపాడుకోవటం కూడా అంత ముఖ్యం. ఈ రెండింటికీ న్యాయం జరగాలంటే ఇంతకు మించి మరో మార్గం లేదు. ఉందంటావా వదినా! పోనీ, ఉంటే చెప్పు...."

రాజేశ్వరి కేమనటానికీ పాలుపోలేదు. విజయనీ, మరిదినీ,భర్తనీ మార్చి మార్చి చూస్తూ నిలబడి పోయింది.

విజయ మీదే ఉన్నాయి అందరి కళ్ళూ. కొన్ని క్షణాలపాటు తలదించుకుంది విజయ. అంతర్ముఖంగా తన్ను తాను చూసుకుంటున్న యోగినిలా నిలబడింది.

"ఆయన షరతు వొప్పుకుంటున్నానక్కయ్యగారూ!" అంది.

ఆడపెళ్ళివారు ఆ షాక్ నుంచి తేరుకోటానికి ముందే- విజయ మెడలో కృష్ణమూర్తి అందించిన కళ్యాణమాల వేసేసాడు సుధాకర్ నవ్వుతూ. *

---

Published by K. Rajendra Babu, 80, Dhanalaxmi Colony, Madras - 600 026., and Printed by Sri Vijaya Bapineedu at Vijaya Graphics, 8. Arcot Road, Madras-600 026. Phone: 421616
Editor: VIJAYA BAPINEEDU.